క్లుప్తంగా

గిరిజన పాఠశాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో తహసీల్దార్ మాట్లాడారు. పరిసరాలను పరిశీలించిన తహసీల్దార్ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని, వంటలో తాజా కూరగాయలు వినియోగించాలన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులుసోకే ప్రమాదం ఉందని, విద్యార్థులు వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ మహేశ్వరెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి

సి.బెళగల్: సామిజిక పింఛన్ పంపిణీ శనివారం పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సంక్షేమ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఉదయం 6 గంటల లోపు గ్రామాలకు చేరుకుని పింఛన్ పంపిణీని ప్రారంభించాలన్నారు. ఆలస్యం చేసినా, అలసత్వం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

బ్రాహ్మణదొడ్డిలో దోమల మందు పిచికారీ



దోమలమందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్ దస్తగిరి

సి.బెళగల్: మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ దస్తగిరి పారిశుధ్య కార్మికులతో దోమల మందును పిచికారీ చేయించారు. గ్రామ సచివాలయ పరిసరాలతో పాటు, ప్రధాన వీధులలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. అదేవిధంగా ఫ్రైడే డ్రైడే సందర్భంగా ప్రజలకు నీటి నిల్వలతో కలిగే అనారోగ్య సమస్యలు సర్పంచ్ ప్రజలకు వివరించారు.

వందశాతం పింఛన్లు పంపిణీ చేయాలి

కోడుమూరు రూరల్: సామాజిక పింఛన్ పంపిణీ వందశాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సెప్టెంబరు 1న ఆదివారం వచ్చినందున ప్రభుత్వం ఆగష్టు 31వతేదీనే లబ్ధిదారులకు పింఛన్లు అందజేయాలని ఆదేశాలి జారీ చేసిందన్నారు. మొదటి రోజే లబ్ధిదారులకు నగదు అందజేయాలని, స్థానికంగాలేని వారికి సెప్టెంబరు 2వతేదీన వ్వాలని సిబ్బందికి సూచించారు.

పాణ్యం: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఈఓఆర్డీ సులోచన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 6,335పింఛన్‌దారులు ఉండగా రూ.2కోట్లు 65లక్షలు, 63వేలు మంజూరైందని, 31వ తేదీన లబ్ధిదారులకు నగదు అందజేయాలని సూచించారు.

కల్లూరు: మండలంలో శనివారం ఉదయం నుంచే గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారని ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 6,067 మంది పింఛన్ లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వినాయక నిమజ్జన బావికి గేటు ఏర్పాటు

కోడుమూరు రూరల్: కోడుమూరులో వినాయకులను నిమజ్జనం చేసే బావికి శుక్రవారం గణేష్ ఉత్సవ సమితి సభ్యులు నూతన గేటును ఏర్పాటు చేశారు. స్థానిక శివశక్తి బృందం సభ్యులు గేటు ఏర్పాటుకు రూ.80వేల అందజేశారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి, శివశక్తి బృందం సభ్యులు నాగేశ్వరరావు, కిరణ్, ప్రతాప్ రెడ్డి, కట్టెల శ్రీనివాసులు, గణేష్, శంకర్, నటరాజ్, ఈశ్వర్‌రెడ్డి, వేణుగౌడ్, కిశోర్, విజయ్, రాంప్రసాద్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పశువులకు 'సీజనల్' ముప్పు!

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం
- జీవాల ప్రాణానికే ప్రమాదం
- పశుపోషకులు అప్రమత్తతే ముఖ్యం



పెసరవాయిలో ఆవుకు టీకా వేస్తున్న డాక్టర్ (ఫైల్)

గడివేముల: పశువులకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచివుంది. ప్రత్యేకించి వర్షాకాలంలో పశువుల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా మూగజీవాల ప్రాణాలకే ముప్పు. పశుపోషకుల అప్రమత్తతే మూగప్రాణాలకు శ్రీరామరక్ష. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు సాధారణమైనవే అయినా పాడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పశువు కదలికలను గుర్తించకుంటే ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు. వర్షాకాలంలో పాడి రైతులుతోపాటు గొర్రెలు, మేకల పెంపకం దార్లు అప్రమత్తంగా ఉండాలంటున్నారు పశు వైద్యులు. పశుపోషకులు, గొర్రెల పెంపకందారులు మూగజీవాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఏ మాత్రం తేడా ఉన్నా వెంటనే చికిత్స చేయించాలి. జీవాలు పూర్తి ప్రమాదకర పరిస్థితిలో ఉంటే 1962 టోల్ ఫ్రీ నంబరు ఫోన్ చేయాలి. సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో పశు వైద్యులు, సిబ్బంది అక్కడికి వచ్చి చికిత్స అందిస్తారు. సీజనల్ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల వివరాలు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం...

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలకు ఎక్కువగా సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. దీంతో నీరసం గామారి నడిచేందుకు కూడా ఇబ్బంది పడతాయి. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ గొంతువాపు ప్రాణాంతకం మందులను వాడాల్సి ఉంటుంది.

కలుషిత నీటితో జలగ వ్యాధి...

మురుగునీరు, కాల్వల్లోని కలుషిత నీరు తాగడం వలన పశువులకు ఎక్కువగా జలగ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. ఈ వ్యాధికి గురైనప్పుడు మేత తినడంలో పశువులు బాగా ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. జలగ వ్యాధి ప్రబలకుండా ఈ పశువులను మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి నివారణకు డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీ లీటర్ల నీయోజడ ప్లస్‌ను అందించాలి.

నట్టల వ్యాధితో ఎదుగుదలకు బ్రేక్

వర్షాకాలంలో పశువులు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. ఎక్కువగా గొర్రెలు ఈ వ్యాధిబారిన పడతాయి. నట్టల వ్యాధితో జీవాల ఎదుగుదల సక్రమంగా ఉండదు. జీవాలు తిన్న ఆహారమంతా నులి పురుగులే స్వాహా చేస్తాయి. దీంతో జీవాలు తరచూ రోగాల బారిన పడే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా నట్టల నివారణ మందులు వేయించాలి.

ఇటాస్ వ్యాక్సిన్‌తో చిటుకు వ్యాధికి చెక్...

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా చిటుకు వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరంతో ఇబ్బంది పడుతుంటాయి. ఈ వ్యాధి కట్టడికి జూలై, ఆగస్టు మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. పశుపోషకులు నిరంతం అప్రమత్తంగా ఉండాలి. పశువు కదలికను గమనిస్తూ ఉండాలి.

గొంతువాపు వ్యాధి ప్రాణంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు ప్రాణాంతకం. ఈ వ్యాధి భారినపడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ వస్తుంది. శ్వాస పీల్చడానికి చాలా ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరుదిగి గొంతువాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధివ్యాప్తి చెందకుండా ఈ పశువులను మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి నియంత్రణకు హెచ్ఎస్ టీకాలు వేయించాలి.

మండలంలోని పశు సంపద:	
తెల్లవి....	5,310
నల్లవి....	8,245
గొర్రెలు..	18,424
మేకలు...	8,865
కోళ్లు.....	18,258

పశువులకు సకాలంలో చికిత్స చేయించాలి



అనారోగ్యానికి గురైన పశువులకు సకాలంలో చికిత్స చేయించాలి. పశువుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీస్తూ ఏ మాత్రం తేడా ఉన్నా వెంటనే పశువైద్యులను సంప్రదించాలి. గొంతువాపు, చిటుకు తదితర వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. పశు సంరక్షణపై ఎలాంటి సందేహాలున్నా పాడి రైతులు స్థానిక పశు వైద్య కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించవచ్చు.

– డాక్టర్ సాయి హరిణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, గడివేముల

2న ఆరోగ్య అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): మత్తు పదార్థాల వ్యసనం వల్ల కలిగే అనర్థాలపై ఈ నెల 2వ తేదీన ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందని, ఇందులో నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాల మానసిక విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఇక్రముల్లా ప్రసంగిస్తారన్నారు.

నలుగురు క్లర్క్‌లకు పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న నలుగురు క్లర్క్‌లకు (సీనియర్ అసిస్టెంట్లు) ఆఫీస్ సూపరింటెండెంట్లుగా పదోన్నతి లభించింది. శుక్రవారం కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో ఆర్‌డీ డాక్టర్ వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ప్రాంతీయ శిక్షణ కేంద్రం(మేల్)లో పనిచేస్తున్న శ్రీనివాస్ నర్సింగ్ కాలేజీకి, గడియారం ఆసుపత్రిలో పనిచేస్తున్న సత్యనారాయణరాజు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు, ఆస్పరి పీహెచ్‌సీలో పనిచేస్తున్న బాలస్వామి ప్రాంతీయ కంటి ఆసుపత్రికి, జిల్లెల్ల పీహెచ్‌సీలో పనిచేస్తున్న సాయిప్రసాద్ నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పదోన్నతిపై బదిలీ అయ్యారు.

రంగస్థల కళాకారుడు అక్బర్ బాషా మృతి

కర్నూలు కల్చరల్: ప్రముఖ రంగస్థల కళాకారుడు అక్బర్ బాషా అనారోగ్యంతో శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయన కర్నూలు జిల్లా రంగస్థల వేదికలపై 800 సార్లు ఆంజనేయ స్వామి పాత్రను పోషించి భళారే అనిపించుకున్నారు. ఈయన మృతికి కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు చౌదరి, కార్య నిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫీయులా తదితరులు సంతాపం ప్రకటించారు.

రోడ్డును బాగుచేయాలని నిరసన



రోడ్డుపై బురద నీటిలో దిగి నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండలంలోని జి.శింగవరంలో పెండింగ్‌లో ఉండి గుంతలు పడిన కర్నూలు-సుంకేసుల రోడ్డును పూర్తిచేయాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ గ్రామంలో రోడ్డుపై గుంతల్లోని బురద నీటిలో దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ..గ్రామంలో రోడ్డు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయని, గుంతల కారణంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డును బాగు చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తారు. డీవైఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా, ప్రకాష్, అంజి, సురేష్, వంశీ, నరేష్, రాము, హరి రాజు, సుధాకర్, శ్రీనివాసులు, విశ్వనాథ్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



గూడూరులో మున్సిపల్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటుతున్న చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు



గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, ఉపాధ్యాయులు

కోడుమూరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మిషన్ హరిత ఆంధ్రప్రదేశ్-మనం-వనం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది గూడూరులో మున్సిపల్ చైర్మన్ అధికారులతో కలిసి మొక్కలను నాటారు. చైర్మన్ మాట్లాడుతూ చెట్లను విచ్చలవిడిగా నరికేయడం మూలంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా కనీసం ఓ మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు వైష్ణవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లన్న, కౌన్సిలర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం అందరి బాధ్యత

సి.బెళగల్: మొక్కలు పెంచడం అందరి బాధ్యత అని డ్వామా ఏపీడీ అల్లిపీర పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో ఉపాధి హామీ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ బలరాముడు ఆధ్వర్యంలో ఏపీడీ, ఎంపీడీఓ, ఏపీఓ లక్ష్మన్న తదితరులు మొక్కలను నాటారు. ఏపీడీ మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. పాఠశాలలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగించాలని ఎంపీడీఓ పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధి ఈసీ పృథ్వీరాజ్, టీఏలు రామ్‌శంకర్, రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ విజేయుడు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ బాబు ప్రసాద్

ఓర్వకల్లు: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలలో మోటార్ సైకిళ్లను దొంగలించి తప్పించుక తిరుగుతున్న దొంగను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సీఐ చంద్రబాబునాయుడితో కలిసి డీఎస్పీ బాబు ప్రసాద్ నిందితుడి అరెస్టును చూపించారు. డీఎస్పీ, సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో నివాసముంటున్న యువకుడు షేక్ మహ్మద్ వలి జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు వృత్తిగా ఎంచుకున్నాడన్నారు. పోలీసుల కళ్లుకప్పి తప్పించుక తిరుగుతుండేవాడు. అతనిపై పోలీసు స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా పోలీసులు గాలింపు చేపట్టారు. మండలంలోని జాతీయ రహదారిపై బేతంచెర్ల క్రాస్‌రోడ్డుపై అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్‌వలిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని విచారించగా నేరాలు అంగీకరించారు. నిందితుడి సమాచారం మేరకు నాలుగు పల్సర్ మోటార్ సైకిళ్లు, ప్యాషన్‌ప్రో బైక్, హీరోసీడీ డాన్ మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని కోర్టుకు తీసుకెళ్లగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఈ సందర్భంగా డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సునీల్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల కోసం తీసుకొచ్చిన యునిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పెన్షన్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదన్నారు. పెన్షన్ పొందడానికి 20 సంవత్సరాలు సరిపోతుందని, కొత్త విధానంలో మాత్రం 20 ఏళ్ల సర్వీసు నిర్ణయించడం అన్యాయమన్నారు. దశాబ్దాల పాటు సేవ చేసే ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం హక్కు అన్నారు. యునిఫైడ్ పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

బోధనా నైపుణ్యం మెరుగు పరుచుకోవాలి



వైద్యులతో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్యాబోధకులు నిరంతరం తమ టీచింగ్ స్కిల్స్ మెరుగుపరచుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో శుక్రవారం ఎస్ఎంసీ గైడ్‌లైన్స్ మేరకు ఎంఈయూ కో-ఆర్ ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బోధకులు తమ స్కిల్స్ మెరుగుపరుచుకుంటే వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, అందుకే నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలని సూచించారు. నోడల్ సెంటర్ భాస్కర మెడికల్ కాలేజీ నుంచి అబ్జర్వర్‌గా డాక్టర్ సాజియా పర్వీన్ హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, ఎంఈయూ సభ్యులు డాక్టర్ విజయానంద బాబు, డాకర్లు లక్ష్మి, విశాల, అరుణ, కుముద, భానుప్రకాష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కళ్ల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు కె.స్వాతి

కర్నూలు(సెంట్రల్): ప్రతిఒక్కరూ కళ్ల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, భరత్ హాస్పిటల్ కంటి వైద్యురాలు డాక్టర్ కె.స్వాతి పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, భరత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శ్రీరామ్‌నగర్‌లోని భగత్ సింగ్ గ్రంథాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు చెప్పారు. కళ్ల సంరక్షణ కోసం పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటివి తినాలని సూచించారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు ఆర్.నరసింహులు, వెంకటేశ్వర్లు, కేవీ జనార్దన్ పాల్గొన్నారు.

పాణ్యంలోని మార్కెట్ బ్రిడ్జి వద్ద కుంటను తలపిస్తున్న వర్షపునీటి నిల్వ



వర్షం పడితే అంతే...

పాణ్యం: చిన్న పాటి వర్షం కురిసిన వాహనదారులు, బాటసారులు బురద అంటిచుకోవాల్సిందే. అంత దారుణంగా ఉన్నాయి పణ్యంలోని పీయూపీ బ్రిడ్జిలు. జాతీయ రహదారిని దాటేందుకు పాణ్యం మార్కెట్ వద్ద పీయూపీ(పబ్లిక్అండర్‌పాస్), పాణ్యంలోని నాలుగు కూడళ్ల వద్ద వియూపీ (వెహికల్ అండర్‌పాస్)బ్రిడ్జిలను నిర్మించారు. అయితే ఈ బ్రిడ్జిల కింద చిన్న వర్షం పడినా.. అంతే సంగతి. వర్షపునీరు వెళ్లేందుకు హైవే అధికారులు కాల్వలను ఏర్పాట్లు చేయలేదు. వర్షపునీరు నిలిచి కుంటలను తలపిస్తాయి. బ్రిడ్జిల కింద రోజుల తరబడి నీటి నిల్వ ఉంటుంది. దుర్వాస వెదజల్లుతుంది. బురదనీటిలో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. అప్పుడప్పుడు వాహనచోదుకులు కిందపడి సందర్భాలు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపునీరు వెళ్లేందుకు కాల్వలను ఏర్పాటు చేయించాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు

ఓర్వకల్లు: ఓర్వకల్లు గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణుడి ప్రతిమను భక్తులు భక్తిశ్రద్ధలతో ఊరిగించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో పురవీధుల్లో స్వామి విగ్రహాన్ని ఊరేగించారు. ముందుగా ఉత్సవ నిర్వాహకుడు పుల్లారెడ్డి భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకుడు పుల్లారెడ్డి, చింతలపల్లె, ప్రసిడెంట్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు కమిటీ ప్రసిడెంట్ మునిదాసు, సభ్యులు కుమారాచారి, సంజీవ, చక్రపాణి, పార్థసారథి, నాగమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామానికి చెందిన ఎక్కలూరి వెంకటలక్ష్మీ నిద్రమాత్రలుమింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. భర్త చనిపోవడంతో మామ, మరిది ఆస్తి ఇవ్వకపోవడంతో పాటు, నిత్యం మాటలతో వేధించడం వలన నిద్రమాత్రలు మింగినట్లు చెప్పారు.గుర్తించిన బంధువులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారన్నారు. బాధితురాలు వెంకటలక్ష్మీ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

గూగుల్ ఆర్గనైజర్‌గా ఆర్జీఎం విద్యార్థిని లక్ష్మీ



పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగానికి చెందిన విద్యార్థిని సాయి లక్ష్మీ గూగుల్ ఆర్గనైజర్‌గా ఎంపికయ్యారు. గూగుల్ డెవలప్పర్ గ్రూప్ ఆన్ క్యాంపస్ ఆర్గనైజర్‌గా సాయి లక్ష్మీ ఎంపికై య్యారని ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. సాయి లక్ష్మీని చైర్మన్ శాంతిరాముడు, ఎండీ శివరాం, అభినందించారు.

1,388 టన్నుల ఇసుక బుకింగ్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ గ్రామ సచివాలయం – 2లో మూడవ రోజు శుక్రవారం 1,388 టన్నుల ఇసుక బుక్కింగ్ అయినట్లు అధికారులు తెలిపారు. 60 టిప్పర్లు, 55 ట్రాక్టర్లు ఇసుక తరలింపునకు నమోదు చేయించుకున్నారని వీఆర్వోలు సాయిరమణ, లింగేష్‌లు తెలిపారు.

కమనీయం కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి కళాక్షేత్రం ప్రారంభ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య మంగళ కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. అంతకుముందు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ కళాక్షేత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవాన్ సత్యసాయి సేవలు మరువలేనివన్నారు. ఆయన బోధనలు, ప్రవచనాలు ఎంతో మంది జీవితాల్లో మార్పులు తెచ్చాయని వివరించారు. సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు డి.సాయికృష్ణారెడ్డి, కన్వీనర్ మాకా అశోక్ కుమార్, మాజీ అధ్యక్షుడు సాయిబాబా, సీనియర్ సేవాదళ్ రామ్మోహన్, జిల్లా మహిళా సేవాదళ్ ఇన్‌చార్జ్ లక్ష్మీసరోజ, మహిళా కన్వీనర్ సంధ్య, యూత్ కన్వీనర్ సందీప్, సభ్యులు సప్తపతి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.